# ఆంతర్యం

అతడు గట్టిగా అరిచేడు. భూమ్యాకాశాలు దద్దరిల్లేట్టుగా అరిచేడు, చుక్కలురాలి పడేలా, పసిపిల్లలు భయపడేలా అరిచేడు. అతడి కంఠం నిశ్శబ్దంగా, గంభీరంగా వున్న ఆ కాలనీలో భయంకరంగా ప్రతిధ్వనించింది. అతడు అరుస్తూనే వున్నాడు. మాటలు ముద్ద ముద్దగా వుస్తున్నాయ్. కాళ్ళూ చేతులు కాగితపు పీలికలతో చేయబడినట్లు మనిషి నిలబడలేక, శివమెత్తినవాడిలా వూగిపోతున్నాడు.

“నేను మొగుణ్ని– నన్నే వెళ్ళగొడతావా? పిల్లలన్ని చూడటానికి వీల్లేదంటావా? ఏవిటన్నావ్. చెడిపోయానికదూ– అవును చెడిపోయాను, తాగుతాను. ఇంకా ఇంకా తాగుతాను– చచ్చేదాకా తాగుతాను. నీ జులుం ఏమిటి?–” ఇలా సాగిపోతోంది అతడి వాగ్ధోరణి. అతడు అంతలా గొంతుచించుకుని అరుస్తున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఒక్క తలుపు తెరుచుకోలేదు. కారణం, ఆ కాలనీవాసులకది మామూలే!

అతడి పేరునాగరాజు. సత్సాంప్రదాయమైన నిండుకుంటుంబంలో పుట్టేడు. ఆచార వ్యవహారాలు, పరువు ప్రతిష్టలు ఆస్తి పాస్తులుగా భావించే కుటుంబంలోని పిల్లని పెళ్ళాడేడు. రత్నాల్లాంటి పిల్లలు. తనూ, తన సంపారం హాయిగా, సంతోషంగా జీవించగలగటాని కనువైన వుద్యోగం అదనపు అదృష్టంలా భార్యకిగూడా చిన్న వుద్యోగం. అన్ని విధాల అదృష్టం అతడిని అందలం ఎక్కించాలని చూసింది. కాని, కడివెడుపాలలో చిన్న విషపుచుక్కలా అతడికి త్రాగుడు అలవాటయింది. ఎప్పుడు, ఎక్కడ, ఎలా మొదలైందో ఎవ్వరికీ తెలిదు. కాని అలవాటయింది. ఆ రాక్షసి అతడిని తనకి బానిసని చేసుకుంది. మొదట్లో కొద్దికొద్దిగా, నాగరికత ముసుగులో త్రాగేవాడు. అటు తర్వాత, ఆ ముసుగుని తొలగించి బాహాటంగా, విచ్చల విడిగాత్రాగేవాడు. ఆపైన భార్యాపిల్లల భవిష్యత్తుని తాకట్టుపెట్టి తాగేవాడు. ఇప్పుడతనికి తెల్లవారేది త్రాగటానికి, మధ్యాహ్నమయ్యేది త్రాగటానికి– చీకటిపడేదీ త్రాగటానికే!

ప్రస్తుతం బ్రతికేందుకు త్రాగే స్థితికి దిగజారేడు.

మణి, అతడిభార్య రూపవతి, గుణవతి. భర్తని ప్రేమించమని, పూజించమని, సర్వస్వమనుకోమని చెప్పిన తల్లి తండ్రుల మాటలు తు.చ. తప్పకుండా పాటించింది. అతడిని అపురూపంగా చూసుకుంది. గుండెల్లో పెట్టి పూజించింది. కానీ నాగరాజు అంతటి అదృష్టాన్ని భరించలేనట్లు, వ్యసనానికి లోనయ్యాడు. మొదట్లో, భర్తకి సలహారూపకంగా మంచిగా చెప్పింది. లాలించి, బుజ్జగించి పసిపిల్లాడిలా దగ్గరకు తీసుకుని చెప్పింది. ఏడ్చి, బెదిరించి చెప్పింది. చివరికి– ఛ! అయినా అతడు విన్లేదు. త్రాగుడు మానకపోగా, కనీసం ప్రయత్నమన్నా చెయ్యలేదు. ఇంట్లో ఎక్కడెక్కడో దాచిన డబ్బులు మాయమయ్యేవి. ఆ డబ్బులతో పాటుగా, అతడు సారా దుకాణంలో వెలిసేవాడు.

అతడి సంపాదన ఇంటిదాకా వచ్చేదికాదు. ఆమెకొచ్చే కొద్దిపాటి జీతంలోనే సంసారం గడవాలి. ఎంతో జాగ్రత్తగా, కత్తిమీది సాములా నడి సముద్రంలో నావికుడిలా సంసారాన్ని గుంభనగా, పరువుగా చెయ్యాలని ఎంతగానో ప్రయత్నించింది. కాని ఆమెవల్ల కాలేదు. నాగరాజు వల్ల ఆ ప్రయత్నాలన్నీ, విఫలమైనాయ్. ఎదుగుతున్న పిల్లలు, పెరుగుతున్న ఖర్చులు, ఆకాశానంటుతున్న ధరలు, ఈవలయంలో చిక్కుకుని ఆమె గిలగిల్లాడింది. చేయూతకోసం తపించి పోయింది. కాని నాగరాజుకి ఇవేవి పట్టించుకోవాలనిపించలేదు. అతడిధోరణి అతడిది. త్రాగుడు... త్రాగుడు... త్రాగుడు.

ఆమె బాగా ఆలోచించుకుంది. భవిష్యత్తుని భర్త ప్రవర్తనతో వెచ్చించి పిల్లల బాగోగులతో భాగించి చూసుకుంది. ఒకరోజు తప్పత్రాగి వచ్చిన భర్తని నిలదీసి అడిగింది “మీరు త్రాగుడు మానరా, తిరిగిమామూలు మనిషి కాలేరా.”

అతను నదురు బెదురు లేకుండా “మానాలనుకున్నా మాన్లేను– ఆ స్టేజీ దాటేసాను” అన్నాడు.

ఆమె మళ్ళీ రెట్టించి అడిగింది. “ఇటు నాకళ్ళలోకి ఆటు పిల్లల మొహాల్లోకి చూసి చెప్పండి నిజంగా మాన్లేరా, మాకోసం ఆ మాత్రం చెయ్యలేరా”

అతడు ఏమాత్రం చలించకుండా తాపీగా “నువ్వుత్రాగమంటే మొదలెట్టేనా– వద్దంటే మానెయ్యటానికి?” అన్నాడు.

అంతే! ఆమె ఇంకేమీ మాట్లాడలేదు. కాని మర్నాడు సాయంత్రం అతడొచ్చేసరికి, ఇల్లు తాళం వేసుంది. ఆమె పిల్లల్ని

తీసుకుని ఆ వూళ్ళోనే వుంటున్న అన్నగారింటికెళ్ళిపోయింది. నాగరాజు మొదట్లో తెలీక తికమకపడ్డాడు, భయపడ్డాడు. తర్వాత తెల్సుకుని వెళ్ళి భార్యని రమ్మన్నాడు. ఆమెరానంది. త్రాగుడు మాని మనిషివైతేనే గాని రానంది. తనకి మొగుడు కన్నా పిల్లల భవిష్యత్తు ముఖ్యమంది. సమాజంలో తనకి త్రాగుబోతువాడి భార్యగా గుర్తింపు రావటం సహించనంది. తనవుద్యోగం తను చేసుకుంటూ పిల్లల్ని పెంచుకోవాలని నిర్ణయించుకుంది.

ఆమె వెళ్ళిపోయాక నాగరాజు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. వుద్యోగాని కెళ్ళటం మానేశాడు. పగలు రాత్రి త్రాగి అదే ఆవరణలో పడుంటాడు. తిండిలేదు. బట్టలు మార్చుకోవాలన్న ధ్యాసవుండదు. ఒక్కటేపని త్రాగుడు. విషంలాటి త్రాగుడుతో తననితాను ఆర్పేసుకోసాగేడు. త్రాగటానికి డబ్బులుకావాలి. అంచేత అప్పులు చేసేడు. రకరకాల కారణాలు చెప్పి వూరంతా, ఆఫీసంతా అప్పులేసాడు. ఒకటి రెండుసార్లు ఉండబట్టలేక భార్య పిల్లలని చూడటానికని వెళ్ళేడు– త్రాగి! కాని, ఆమె అన్న మల్లయోధుడిలా వుంటాడు– ఈ గుమ్మంలోనే కాదు; పేటలో కనిపించినా కాల్చి పారేస్తానన్నాడు. అప్పటినించి వంటరిగా ఎడారిలాటి జీవితంలో, చుట్టూ కన్పిస్తున్న ఇసుక దిబ్బల్లాంటి ఎదురు దెబ్బలని మననం చేసుకుంటూ సాగిపోతున్నాడు.

భార్యపైన కోపం వచ్చినపుడు, ఆ నిషాలో, మత్తులో ఏంచెయ్యాలో తెలీక, తనలో వున్న కోపం, ద్వేషం, అసహ్యం ఎలా చెప్పాలో, ఎవరికి చెప్పాలో అర్థంకాక, ఆమె వున్న చోటికెళ్లటానికి ధైర్యం చాలక, తాము అంతకు ముందున్న ఆ కాలనీకొచ్చి ఆ ఇంటి ముందునిలబడి, కాస్సేపు ఇష్టంవచ్చిన భాషలో, నోటికొచ్చిన మాటల్లా పెద్దగా అరిచి ఏదో సాధించినవాడిలా వెళ్ళి పోతుంటాడు. మొదట్లో అతడిని చూసిన అక్కడి చుట్టు ప్రక్కల వాళ్లు కర్మసిద్ధాంతాన్ని తల్చుకుని ఎలాంటివాడు ఎలా అయిపోయాడోనని జాలిపడేవారు. కాని, కాలక్రమేణా అతడి ఆ కార్యక్రమం అలవాటుగా మారటం వల్ల పట్టించుకోవటమే మానేశాడు.

అతడింకా అరుస్తూనే వున్నాడు.

"నన్నొదిలిపెట్టి వెళ్ళిందంటే పిల్లల మీది ప్రేమతోకాదు. ఎవడికి తెలీదు దీని వ్యవహారం? ఆఫీసులో ఆ ఎర్రటి కుర్రాడితో..." తను నైతికంగా పతనమయ్యేవన్న గిల్టుని, ఎదుటి వ్యక్తీ పవిత్రుడు కాదని నిరూపించి తద్వారా కొన్ని క్షణాలు అయినా సంతృప్తి పొందాలన్న తపన...

అంతా నిశ్శబ్దంగా, నిశ్చలంగా వుంది.

అంతలో ఒక ప్రక్క మూలగావున్న ఓ యింటికిటికీ తెరుచుకుంది. మచ్చలేని చందమామ లాంటి ఒక యువతి వదనం ఆ కిటికీలోంచి తొంగి చూసింది.

కాని అతడా విషయాన్ని గమనించలేదు.

"మూడ్రోజులుగా తిండిలేక మలమలామాడి ఛస్తున్నానే– నా వుసురు నీకు తగిలి తీరుతుంది. నేను చచ్చాక నిన్ను సాధించకపోతే– నా పేరు" గాలిలోకి చేతినెత్తి ప్రతిజ్ఞ చేస్తున్నాడు.

కిటికీలోంచి చూసిన ఆ యువతి మెల్లిగా తలుపు తీసి బయటకొచ్చింది. తలుపు తీస్తున్నపుడు కిర్రుమని చప్పుడైంది. గంభీరమైన ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఆ శబ్దం శంఖారావంలా మ్రోగింది.

నాగరాజు అటువైపుగా చూసేడు.

ఆయువతి మెల్లిగా ముందుకొచ్చి నిలబడింది.

ఆమెని చూసేక అతడికి ప్రాణం లేచివచ్చినట్లనిపించింది. మారణహోమం జరిగి, సృష్టియావత్తూ నాశనమయ్యి, తానొక్కడే మిగిలి తోడులేక భయపడుతున్న సమయంలో, కనిపించిన నేస్తంలా భావించాడు. మెల్లిగా తూలుకుంటూ వెళ్ళి ఆ యింటిముందుగా నిలబడ్డాడు.

ఆ యువతి అలాగే నిశ్చలంగా, శిలాప్రతిమలా నిల్చుంది.

ఆమెకి ముప్ఫైఏళ్ళ వయస్సుండవచ్చు. వరదలొచ్చి పరవళ్ళు త్రొక్కుతున్నట్లున్న యౌవ్వనం, బిగువుసడలని శరీరం. అజంతా శిల్పంలా, పాలరాతివిగ్రహం కదలిక లేకుండా నిల్చుని తీక్షణంగా అతడివంక చూస్తోంది. నుదుట బొట్టులేక పోవటం వల్ల ఆమె

అందమైన మొహం పైకప్పులేని ఇల్లులా వెల్తిగా వుంది. ఆమెకళ్ళు ప్రకాశించటం మరచిపోయినబల్బుల్లా వున్నాయ్.

నాగరాజు ఆమెనుద్దేశించి "నమస్తే సిస్టర్" అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడక చలన రహితంగా నిల్చునుంది.

'మీరు– మీరు కొత్తగా వచ్చేరా" అనడిగాడు మళ్ళీ.

ఆమె అవునన్నట్లుగా మెల్లిగా తలూపింది.

"నాపేరు నాగరాజు. ఇదివరకు, అదిగో ఆయింట్లోనే వుండేవాళ్ళం. నా పెళ్ళాం ఎవడితోనో లేచిపోయింది" అనునయం ఆత్మీయత కోసం మనిషిపడే ఆసహ్యపు ఆరాటం...

అప్పటికీ ఆమె ఏం మాట్లడక అలాగే నిల్చుని అతడిని పరీక్షగా చూస్తోంది. "అప్పటి నుంచీ యిలా అయిపోయాను. దాన్ని, ఆ రాక్షసిని మర్చిపోవటానికే త్రాగుతున్నాను– ఒట్టు" ఆమెని నమ్మించాలని ఎంతగా ప్రయత్నిస్తున్నాడు, అంతగా బయటపడి పోతున్నాడు.

"మూడ్రోజులుగా తిండిలేదు" ఆ మాటతనలో తాను అనుకుంటున్నట్లుగా మెల్లిగా అన్నాడు.

ఆ యువతి మొదటి సారిగా మాట్లాడింది.

"ఆకలవుతోందా?"

ఆమె మాటలో జాలి, దయ లాంటివిధ్వనించలేదు. పైగా కఠినత్వం గోచరించింది.

"అవునవును– బాగా ఆకలేస్తోంది" అన్నాడు

ఆమె చటుక్కున వెనుతిరిగి లోనికెళ్ళింది. కొద్దిక్షణాల తర్వాత మళ్ళీ బయటి కొచ్చింది. ఆమె చేతిలో కంచం వుంది దాన్నిండుగా అన్నం పచ్చడి, పులుసు...

మూడ్రోజులుగా తిండి మొహమెరుగని అతడికి అన్నాన్ని చూడంగానే ఆకలి మరింత అధికమయ్యింది. పీనుక్కి ప్రాణం వచ్చినట్లు మెల్లిగా కదలి ముందు కొచ్చాడు. ఆమె తన చేతిలో వున్న కంచాన్ని అక్కడ నడవాల్లో వుంచింది. అతడు చతికిలపడి కూర్చున్నాడు. సభ్యతకి కూడా తావులేకుండా, ఆత్రంగా, అసహ్యంగా, మృగంలా తినసాగేడు.

ఆమెలోనికెళ్ళి చిన్నలోటాతో నీళ్ళు తెచ్చి అతడి ప్రక్కగా వుంచింది.

అతడు పెద్దపెద్ద ముద్దలుగా చేసి నోట్లోకి కూరుకుంటున్నాడు ఏక్షణానైనా తన ముందున్న కంచం లాగేసుకుంటారేమోనన్న భయంతో తింటున్నట్లుగా వుంది అతడివాలకం.

ఆయువతి అలాగే నిలబడితదేకంగా చూస్తోంది.

ఆమె స్మృతిపథంలో ఏవో జ్ఞాపకాలనీడలు నల్లనల్లగా కదిలాయి. దట్టంగా అలుముకున్న నల్ల మబ్బుల మాటున తళుక్కుమన్న గతం తాలూకు ఆలోచన్లు–

భర్తత్రాగొచ్చేవాడు. క్రమంతప్పకుండా ప్రతినిత్యం త్రాగొచ్చేవాడు. తను అతడితో పోట్లాడేది– ఏడ్చేది. ప్రేమతో, బాధతో, భయంతో విలవిల్లాడేది. అయినా అతడు త్రాగేవాడు. అతడు వ్యసనంతో శారీరకంగా, మానసికంగా నైతికంగా పతనమయ్యేడు. కాదని అదక్కడితో ఆగిపోలేదు. అతడి దురలవాటు తాలూకు నీడ తనపైగూడా నల్ల కట్లతాచులా పరుచుకుంది. అతడివల్ల, అతడి వ్యసనం వల్ల తనకిసాంఘికంగా లభించాల్సినంత గౌరవం లభించకపోగా అందరూ చిన్నగా చూసేవారు.అయినా అన్నిటిని భరించింది. చివరికి అతడేం మిగిల్చి వెళ్ళాడు? కన్నీళ్ళు– ఒంటరితనం. రేపు ఇతడి భార్యకి మిగిలేదదేకదా? ఇటువంటి మృగంలాంటి మనుషులు ఎన్నాళ్ళు బ్రతికినా ఏమిటి సుఖం? మరటువంటప్పుడు...

అంతలో అతడు తినటం పూర్తిచేసేడు. లోటాని ఎత్తి నీళ్ళు గటగటా త్రాగేడు "నువ్వు దేవతవి నన్ను బ్రతికించేవు" అన్నాడు లేచి నిలబడుతూ.

ఆమె అతడి వంక భావరహితంగా చూసింది. కంచాన్ని తీసుకునివెళ్ళబోతూ "నీ భార్య ఎక్కడుంటుంది?" అనడిగింది.

"ఏమో! ఎక్కడచచ్చిందో - ఎవడికి తెల్సు-' అని మొహం చిట్లించాడు...

ఆమెలోనికెళ్ళి తలుపుగడియ పెట్టుకుంది.

ఆమర్నాడు వుదయం-

ఆకాలనీ వాళ్ళందరూ నాగరాజు శవం చుట్టూ మూగేరు. అందరూ తలోవిధంగా, విడివిడిగాను కల్సికట్టుగాను మాట్లాడుకుంటున్నారు. "నాగరాజండీ- మొదట్లో లక్షణంగా వుండేవాడు. అదిగో అయింట్లోనే వుండేవాళ్ళు. ఖర్మండి-' ఖర్మ! ఎవరు తప్పించగలరు చెప్పండి. అతడి భార్య మహా ఇల్లాల్లెండి. ఈ మధ్య అతగాడితో ప్రాణం విసుగెత్తి అన్నగారింటికెళ్ళింది. రాత్రి గూడా కేకలు, అరుపులు వినబడ్డాయ్. ప్రతి రోజు వున్నదేగదాని పట్టించుకోలేదు. రాత్రి బాగా త్రాగేసి వుంటాడు. గుండె కాస్త ఆగిపోయింది. అయినా ఎంతకావాలండి వెధవ ప్రాణం పోవటానికి- ప్చ్- ఎలాంటి కొంపలో పుట్టేడో, ఎలా పెరిగాడో, చివరికీ విధంగా... అమ్మాయి అడ్రస్సుగాని ఎవరికైనా తెల్సునా... శవాన్ని ఎంతసేపని ఇలా పెట్టుక్కూర్చుంటాం".

అలా అందరూ జట్లు జట్లుగా నిలబడి మాట్లాడుకుంటుండగా ఆ యువతి తలుపు తీసుకుని బయటికొచ్చింది. మెల్లిమెల్లిగా నడుచుకుంటూ వచ్చి కాస్తదూరంలో నిల్చుని అతడి శవం వైపు దీక్షగా ఒక్కక్షణం చూసింది. అతడి మొహం ప్రశాంతంగా "నన్ను బ్రతికించావ్" అంటున్నట్లుగా వుంది.

అంతలో ఎవరో ఇంకెవరితోనో అంటున్నాడు. "ఉద్యోగం మంచిదే- త్రాగుడికి అలవాటుపడి వెళ్ళటం మానేశాడు. ఇప్పుడితడి భార్యకి ఫింఛను వగైరా బాగానే వస్తాయి"

ఆ మాట విన్న ఆ యువతి మొహంలో తృప్తితో కూడిన భావం తళుక్కుమంది. ఆమె వెంటనే వెనుతిరిగింది.

"ఇతగాడు ఎన్నేళ్ళుబ్రతికినా ఆ యిల్లాలి కేవిటి లాభం? పైగా ఆమె పరువు ప్రతి గడప ముందు పెట్టి అవమానించటం తప్ప అతడే విధంగా ఆమెకి సాయపడగలడు? కనిపించని దేవతలని మెప్పించటానికి నరమేధం చేసే ఈ దేశంలో, సాటి ఆడదానికి కన్నీరు తుడవటానికింతకన్నా నేనేం చెయ్యగలను? పనికిరానివస్తువును విజర్జించినట్లు..."

దుష్టసంహారానంతరం తిరిగి దేవాలయ ప్రవేశం చేస్తున్న దేవతలా లోనికెళ్ళి తలుపు గడియ పెట్టుకుంది.